

చౌడేశ్వరీదేవికి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారికి శుక్రవారం పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తిని పల్లకీలో ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన శంకర వెంకట కామేశ్వరరావు రూ.1,01,116 విరాళాన్ని అందించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:23,295
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:23,193

న్యూస్‌రీల్

బానకచర్ల నుంచి 26 వేల క్యూసెక్కులు విడుదల



ఎస్‌ఆర్‌ఎంసీలో ప్రవహిస్తున్న నీరు

పాములపాడు: బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి 26,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈఈ దేవేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి ఎస్‌ఆర్‌ఎంసీ ద్వారా 26,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందన్నారు. తెలుగుగంగ (వీబీఆర్)కు 11,000, జీఎన్‌ఎస్ఎస్‌కు 12,000, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 3,000 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు వివరించారు.

శ్రీశైలం మెడికల్ ఆఫీసర్ సస్పెన్షన్

గోస్పాడు: విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్న శ్రీశైలం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షహనాజ్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఇటీవల సీఎం శ్రీశైలం పర్యటన సందర్భంగా డాక్టర్ షహనాజ్ విధులకు గైర్హాజరు కావడంతో పాటు తరచూ విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తూ రోగులకు అందుబాటులో ఉండటం లేదన్నారు. ఈ క్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు విచారించిన అనంతరం ఈ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. వారి ఆదేశాల మేరకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షహనాజ్‌ను సస్పెండ్ చేశామన్నారు.

మహానందిలో మహాలక్ష్మీ హోమాలు



మహాలక్ష్మీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: శ్రావణమాసం మూడవ శుక్రవారం పురస్కరించుకుని మహానంది క్షేత్రంలో మహాలక్ష్మీ హోమాలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్థానిక యాగశాలలో మహాలక్ష్మీ హోమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల భక్తులు ఆర్జిత సేవా టికెట్ల ద్వారా హోమంలో పాల్గొన్నారు. హోమాల అనంతరం భక్తులకు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారి ప్రసాదాలు అందించారు. శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి నెమలి పింఛములతో అలంకరణ చేశారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు అమ్మవారికి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు అమ్మవారి అలంకరణ చూసి మంత్రముగ్ధులయ్యారు. శ్రావణమాసం సందర్భంగా భక్తుల రద్దీ కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. స్థానిక కల్యాణ మండపంలో స్వామి అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి యాగశాలలో మహానందీశ్వరుని దంపతులకు ఏకాంత సేవ పూజలతో దర్శనం సేవలు ముగిశాయి.

ముగిసిన మొహర్రం సంతాప దినాలు



బనగానపల్లెలో మాతం నిర్వహిస్తున్న షియా మతస్తులు

బనగానపల్లె: మొహర్రం సంతాప దినాలు శుక్రవారంతో ముగిశాయి. మొహర్రం వేడుకలు గత నెల 6వ తేదీ పీర్ల నిమజ్జనంతో ముగిసింది. అప్పటి నుంచి షియా మతస్తులు 40 రోజుల పాటు సంతాప దినాలుగా భావిస్తారు. మతసామరస్యానికి ప్రతీక అయిన మొహర్రాన్ని బనగానపల్లెలో షియా మతస్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. శుక్రవారం మొహర్రం సంతాప దినాలు ముగియడంతో కొండపేటలోని పీర్లచావిడి నుంచి బయల్దేరిన ఇమాంహుసేన్, ఇమాంహుస్సేన్ పీర్లతో భక్తిగీతాలు ఆలపిస్తూ మాతం నిర్వహిస్తూ రక్తాన్ని చిందించారు. ఈ మాతం కార్యక్రమం పాత సిండికేట్ బ్యాంకు వరకు సాగింది. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి స్థానిక ఆస్థానం నుంచి బనగానపల్లె నవాబు వంశీయులు మీర్ ఫజల్ అలీఖాన్‌తో పాటు షియా మతస్తులు పాల్గొని మాతం చేసుకుంటూ నవాబు కోట వరకు వెళ్లారు. కార్యక్రమంలో పలువురు షియా మత పెద్దలతో షియా మతస్తులు పాల్గొన్నారు. మాతం చూసేందుకు అధిక సంఖ్యలో హిందూ, ముస్లింలు తరలివచ్చారు.



డిగ్రీ కళాశాల మైదానంలో పరేడ్‌కు హాజరైన పోలీసు సిబ్బంది

సమగ్రాభివృద్ధికి అంకితమవుదాం



- పంద్రాగస్టు వేడుకల్లో రోడ్డు, రవాణా శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

నంద్యాల: స్వాతంత్య్ర సమరయోధులను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాప్రతినిధులు, అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాను అగ్రభాగాన నిలిపేందుకు అంకితం కావాలని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని మంత్రి బీసీ ఆవిష్కరించారు. ఆతర్వాత పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం మంత్రి స్వాతంత్య్ర దినోత్సవ సందేశాన్ని అందించారు. వేడుకలో జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, డీఆర్‌ఓ రామునాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజల్లో స్వాతంత్రోద్యమ స్ఫూర్తి కలిగించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, గోసాయి వెంకన్న, వడ్డే ఓబన్న, నంద్యాల కాదర్‌బాద్ నర్సింగరావు, ఆంధ్ర తిలక్ గాడిచర్ల హరిసర్వోత్తమరావు, యశ్లారి స్వామిరెడ్డి, పెండేకంటి వెంకటసుబ్బయ్య, బీవీ సుబ్బారెడ్డి, గుర్రం వెంకటరెడ్డి, గామాగో వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఏడాది కాలంలో అభివృద్ధి, సంక్షేమంతో కూడిన సుపరిపాలన అందిస్తున్నామన్నారు. అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషం ఇవ్వటమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి, ఇంటింటికీ నీటి భద్రత, రైతు – వ్యవసాయ సాంకేతికత, ప్రపంచస్థాయి పంపిణీ వ్యవస్థ (లాజిస్టిక్స్), శక్తి మరియు ఇంధనాల వ్యయ నియంత్రణ, అన్ని రంగాలలో పరిపూర్ణ ఉత్పాదన, సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర, సమగ్ర సాంకేతికత వంటి 10 సూత్రాలతో స్వర్ణాంధ్రను సాధించేందుకు కృషి చేస్తామన్నారు.



దేశభక్తి గేయానికి విద్యార్థుల ప్రదర్శన

త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్, జేసీ విష్ణుచరణ్

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జానపద నృత్యం, భారతీయ పల్లెల సంస్కృతి, సంప్రదాయాలు తెలిపే విధంగా నంద్యాల కేజీబీవీ మైనార్టీ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన అలరించింది. పాణ్యంకు చెందిన విజయానికేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థుల బృందం దేశ సైనిక పోరాటాన్ని ధైర్యం, తెగువ, త్యాగాన్ని ప్రదర్శిస్తూ ఆపరేషన్ సింధూర్‌పై చేసిన ప్రదర్శనతో దేశభక్తి ఉప్పొంగింది. బనగానపల్లెకు చెందిన నెహ్రూ పాఠశాల విద్యార్థులు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రపై చేసిన బృంద ప్రదర్శన బ్రిటీష్ సామ్రాజ్యంపై అల్లూరి చేసిన సాహస పోరాటాలు, భారతావాణి కోసం ప్రాణాలు ఎదురొడ్డి చేసిన త్యాగం, వందే మాతరం నినాదం, దేశమంతటా ఒక్కటే అనే జాతీయ సమైఖ్యతను చాటింది.



ఉద్యాన శాఖ శకటం



స్వచ్ఛాంధ్ర శకటం

ఆకట్టుకున్న శకటాలు...

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రగతి శకటాలను ప్రదర్శించారు. అగ్నిమాపక శాఖ, శక్తి టీం, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, డ్వామా, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, పాఠశాల విద్యాశాఖ, వ్యవసాయం, వైద్య, 108, 104, ఉద్యానవన, డీఆర్‌డీఏ, సహకార బ్యాంక్, గృహ నిర్మాణ, రవాణా, జల వనరుల శాఖ, విద్యుత్ శాఖ సూర్యఘర్ ప్రగతి శకటాలు ఆకట్టుకున్నాయి. వీటిలో ఉద్యాన సూక్ష్మ నీటి సాగు శాఖకు ప్రథమ, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రకు ద్వితీయ, పోలీసు శాఖ శక్తి టీమ్‌కు తృతీయ స్థానంలో నిలువగా, ఆ శాఖ అధికారులకు బహుమతులు పంపిణీ చేశారు.



పోలీసు శాఖ శక్తి టీమ్ శకటం



సంప్రదాయ నృత్య ప్రదర్శన చేస్తున్న నంద్యాల కేజీబీవీ విద్యార్థినులు



పాణ్యం విజయానికేతన్ పాఠశాల విద్యార్థుల 'ఆపరేషన్ సింధూర్'



అదిగదిగో అల్లూరి.. బనగానపల్లె నెహ్రూ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

'ఉపాధి'లో వసూళ్లకు స్వాతంత్య్రం!

శకటం ఏర్పాటుకు అక్రమ వసూళ్లు

- మండలానికి రూ.15 వేలు ఇవ్వాలని ఆదేశాలు
- గతంలో రిపబ్లిక్ డే వేడుకల్లోనూ ఇదే తంతు
- దళారులుగా వ్యవహరిస్తున్న ఏపీఓలు
- హడలెత్తిస్తున్న ఏపీడీలు
- బెంబేలెత్తిపోతున్న డ్వామా క్షేత్ర సిబ్బంది



ఆళ్లగడ్డ: జాతీయ పర్వదినాలైన స్వాతంత్య్ర దినోత్సవం, రిపబ్లిక్ డే వేడుకల నిర్వహణ పేరుతో కొందరు అధికారులు వసూళ్ల పర్వానికి తెరలేపడం విమర్శలకు తావిస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఓ అధికారి ఎవరు ఎంత ఇవ్వాలన్న దానిపై నిర్ణయిస్తున్నారు. అనేక సార్లు క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి నిరసనలు వ్యక్తమైనా వసూళ్ల బాగోతాన్ని వీడలేదు. సందట్లో సడేమియాలా కొందరు మండల స్థాయి ఉద్యోగులు సైతం ఇదే దారిలో పయనిస్తుండటం గమనార్హం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జాతీయ ఉపాధి హామీ పథకంలో అక్రమ వసూళ్లు షరా మామూలే అన్న చందంగా తాయరైంది. జిల్లా అధికారి నుంచి మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది (ఫీల్డ్ అసిస్టెంట్లు) నుంచి రకరకాలుగా అందినకాడికి దోచుకుంటున్నారు. తాజాగా జిల్లా కేంద్రం నంద్యాలలో శుక్రవారం జరగనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఉపాధి పథకం తరఫున శకటం ఏర్పాటు చేసేందుకు ఒక్కో మండలం నుంచి రూ. 10 నుంచి రూ. 15 వేలు వసూలు చేయాలని అనధికారకంగా ఉత్తర్వులు ఇవ్వడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

రూ.3 లక్షల వసూలు

జిల్లాలో ఏ శాఖ ఏర్పాటు చేయని విధంగా ఉపాధి హామీ పథకం శకటం ఉండాలని అధికారి ఆదేశం. ఇందు కోసం 32 టైర్ల లారీ తీసుకుని దానిపై చెరువు మట్టి నింపి ఫాంపాండ్ ఏర్పాటు చేసి దాని చుట్టూ పెద్దపెద్ద చెట్లు పెట్టించాలని ఇందుకోసం ఎంత ఖర్చు అవుతుందో అంతా క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి వసూలు చేయాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో ఏపీడీలు, ఏపీఓలు కలిసి చర్చించి పెద్ద మండలం అయితే రూ.15 వేలు, చిన్న మండలం అయితే రూ.10 వేలు తగ్గకుండా వసూలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాలోని 28 మండలాల పరిధిలో కనీసం రూ. 3 లక్షలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఏపీఓలు, టీసీలు గ్రామాల్లో ఉండే ఫీల్డ్ అసిస్టెంట్లతో వసూళ్లు సాగించినట్లు చర్చ జరుగుతోంది.

రిపబ్లిక్ డే వేడుకలకు రూ. 2 లక్షలు


ఈ ఏడాది జనవరిలో జరిగిన రిపబ్లిక్ వేడుకలకు సైతం ఇలాగే అందరికంటే 'ఉపాధి' శకటమే బాగుండాలని గోకులం (పశువుల షెడ్డు) ఏర్పాటు చేసేందుకు రూ. 2 లక్షలు వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో మండలం నుంచి రూ. 8 వేలు వసూలు చేసి ఇచ్చామని ఇలా మాటిమాటికీ వేలకు వేలు ఇవ్వాలంటే ఎలా అని క్షేత్ర, మండల స్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉంటే ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు ఏమవుతున్నాయో తెలియని పరిస్థితి.

ఎవ్వరి దగ్గర వసూలు చేయలేదు

స్వాతంత్య్ర దినోత్సవం వేడుకల కోసం డబ్బులు వసూలు చేయలేదు. క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి వసూలు చేయమని ఆదేశాలు ఇవ్వలేదు.

– సూర్యనారాయణ, పీడీ, డ్వామా

వడ్లరామాపురంలో నేడు చిన్నన్న అంత్యక్రియలు



చిన్నన్న మృతదేహం

ఆత్మకూరురూరల్: మహారాష్ట్ర – ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల సరిహద్దులో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు సుగులూరు చిన్నన్న అలియాస్ విజయ్, అలియాస్ భవనాశి శంకర్ అంత్యక్రియలు శనివారం ఆయన స్వగ్రామం వడ్లరామాపురంలో జరగనున్నట్లు కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. మహారాష్ట్ర రాజ్‌నంద్ గావ్ జిల్లాలోని మొహాలా ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మహారాష్ట్ర పోలీసులు మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించారు. శనివారం తెల్లవారే సరికి చిన్నన్న మృతదేహం గ్రామానికి చేరుకోవచ్చని భావిస్తున్నారు. 30 ఏళ్లుగా అజ్ఞాత జీవితంలో ఉన్న వ్యక్తి విగతజీవిగా గ్రామానికి చేరుకోనుండడంతో గ్రామస్తులు ఆఖరి చూపు కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

జెడ్పీలో 34 మందికి పదోన్నతులు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ కార్యాలయంతో పాటు జెడ్పీ యాజమాన్య పరిధిలోని వివిధ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 34 మందికి పదోన్నతులు కల్పించారు. శుక్రవారం స్థానిక జెడ్పీలోని తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో వారికి జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి ఉత్తర్వులను అందించారు. పదోన్నతులు పొందిన వారిలో సీనియర్ అసిస్టెంట్ నుంచి పరిపాలనాధికారిగా ఒకరు, రికార్డు అసిస్టెంట్ నుంచి జూనియర్ అసిస్టెంట్లుగా ఐదుగురు పదోన్నతులు పొందారు. అలాగే ఆయా కార్యాలయాల్లో ఆఫీసు సబార్డినేట్, స్వీపర్లుగా విధులు నిర్వహిస్తున్న వారి అర్హతలను అనుసరించి రికార్డు అసిస్టెంట్లుగా 21, లైబ్రరీ అసిస్టెంట్‌గా 1, ల్యాబ్ అసిస్టెంట్లుగా 6గురికి పదోన్నతి కల్పించారు. ఈ నేపథ్యంలోనే కారుణ్య నియామకాల కింద ఆరుగురికి జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు కల్పిస్తు వివిధ కార్యాలయాలకు పోస్టింగ్స్ ఇచ్చారు.



జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.కబర్ధి

పేదలకు న్యాయం జరిగినప్పుడే నిజమైన స్వాతంత్య్రం

కర్నూలు(సెంట్రల్): పేదలకు సరైన న్యాయం జరిగినప్పుడే నిజమైన స్వాతంత్రం లభించినట్లని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో స్వాతంత్య్ర దినత్సోవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి జాతీయ జెండాను ఆవిష్కరించి మహనీయుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మునిసిఫ్ కోర్టులో నూతనంగా ఏర్పాటు చేసిన న్యాయవాదుల సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన డిస్పెన్సరీని ఆయన ప్రారంభించి స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రవిగువేరా తదితరులు పాల్గొన్నారు.

అంగట్లో సెక్యూరిటీ గార్డు పోస్టులు

- పోస్టుకు రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు వసూళ్లు
- కర్నూలు పెద్దాసుపత్రిలో దందా



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సెక్యూరిటీ గార్డుల పోస్టుల భర్తీలో అక్రమాలు జరుగుతున్నాయి. కొందరు దళారులు ఒక్కో పోస్టుకు రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు ఆశావహుల నుంచి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రిలో సెక్యూరిటీ సేవలను ఈగల్ హంటర్ సొల్యూషన్స్ అనే సంస్థ దక్కించుకుంది. ఈ సంస్థ గత జూన్ 1వ తేదీ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సంస్థ ద్వారా కర్నూలు మెడికల్ కాలేజీలో 40 మంది, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో 200 మంది, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో 11 మంది, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో 60 మంది సెక్యూరిటీ గార్డులతో సేవలందించేందుకు ఎంఓయూ చేసుకున్నారు. ప్రతి సెక్యూరిటీ గార్డుకు టోకుగా రూ.16 వేలకు పైగా జీతం వస్తుందని అధికారులకు చెప్పారు. ఒక్కో సెక్యూరిటీ గార్డు రోజుకు ఒక షిఫ్ట్ చొప్పున మూడు షిఫ్టులలో పనిచేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పనిచేస్తున్న వారిని కొనసాగిస్తూనే ఖాళీగా ఉన్న సెక్యూరిటీ గార్డు పోస్టులను భర్తీ చేసుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ పోస్టుకు అభ్యర్థి కనీసం టెన్త్ చదివి ఉండాలని, 45 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని, శారీరక ధృడత్వం ఉండాలని చెప్పుకొచ్చారు. ఇదే క్రమంలో తమకు సబ్‌లీజుకు ఇవ్వాలని కేడీసీసీ బ్యాంకు చైర్మన్, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి అనుచరులు, రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అనుచరులుగా చెప్పుకునే కొందరు పంతం పట్టారు. ఈ మేరకు ఈగల్ హంటర్ సంస్థ ప్రతినిధులతో పలుమార్లు ఒత్తిడి తెచ్చి పంతం నెగ్గించుకున్నట్లు సమాచారం. ఈ మేరకు విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులుగా చెప్పుకునే వారు ఈ సంస్థను సబ్‌లీజుకు తీసుకున్నట్లు ఆసుపత్రిలో చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో వీరు ఖాళీగా ఉన్న సెక్యూరిటీ గార్డు పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఇప్పటికే 25 మందికి పైగానే భర్తీ చేశారు. ఇందులో ఒక్కో పోస్టుకు రూ.లక్షకు పైగా చేతుల మారినట్లు చర్చ నడుస్తోంది. కొందరు దళారులు రంగప్రవేశం చేసి మనం చెప్పినట్లే నడుస్తుందని చెప్పి అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో తమకూ పోస్టులు కావాలని మంత్రి టీజీ భరత్ అనుచరులుగా చెప్పుకునే కొందరు వ్యక్తులు మూడు రోజుల క్రితం ఆసుపత్రిలోని సెక్యూరిటీ కార్యాలయం వద్దకు వచ్చి గొడవ చేశారు. దాదాపు గంటపాటు జరిగిన ఈ ఘర్షణ వాతావరణం ఆసుపత్రిలో ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ క్రమంలో ఇంకా ఖాళీగా ఉన్న వందకు పైగా సెక్యూరిటీ గార్డు పోస్టులను ఎలాగైనా దక్కించుకోవాలని ఇరు వర్గాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. వీరి మధ్యలో దళారులు సైతం చక్రం తిప్పుతున్నారు. తాము చెప్పిన వారికి పోస్టులు ఇవ్వాలని మరోవైపు కొందరు ప్రజాప్రతినిధులు సైతం ఆసుపత్రి అధికారులకు ఫోన్ చేసి చెబుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో పోస్టుల అమ్మకాలు ఆసుపత్రిలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.

జీతంలోనూ భారీ కోత

ఎంఓయూ ప్రకారం ఒక్కో సెక్యూరిటీ గార్డుకు రూ.16 వేలకు పైగా జీతం ఇవ్వాల్సి ఉంది. కానీ ఈ నెలలో సెక్యూరిటీ గార్డులకు రూ.12,100 మాత్రమే ఇచ్చారు. కొత్త ఏజెన్సీ వచ్చినా పాత జీతాలేనా అని సెక్యూరిటీ గార్డులు నిట్టూరుస్తున్నారు. పెంచిన మేరకు తమకు జీతాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. లేకపోతే ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు.

క్లుప్తంగా

కర్నూలు పటాలంకు రాష్ట్రస్థాయి అవార్డు



కంటింజెంట్ అవార్డు అందుకుంటున్న కర్నూలు రెండో బెటాలియన్ సిబ్బంది

కర్నూలు: విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్‌కు కవాతు ప్రదర్శనలో (పెరేడ్) రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. రాష్ట్రస్థాయిలో 8 బెటాలియన్లకు సంబంధించిన సిబ్బంది పరేడ్‌లో పాల్గొనగా కర్నూలు రెండవ బెటాలియన్‌కు సంబంధించి ఆర్ఐ అనిల్ కుమార్, ఆర్ఎస్ఐలు సర్దార్, మునాఫ్‌ల ఆధ్వర్యంలో చక్కటి కవాతు ప్రదర్శన(పెరేడ్) నిర్వహించారు. దీంతో రాష్ట్రస్థాయిలో కంటింజెంట్ అవార్డు లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రెండో బెటాలియన్ సిబ్బంది ఈ అవార్డును అందుకున్నారు. రాష్ట్రస్థాయి పెరేడ్‌లో చక్కటి నైపుణ్యత ప్రదర్శించి కంటింజెంట్ అవార్డును అందుకున్నందుకు పటాలం సిబ్బందిని కమాండెంట్ దీపిక పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు.

రుద్రవరం రేంజర్‌గా ముర్తుజావలి

రుద్రవరం: రుద్రవరం రేంజ్ అధికారిగా ముర్తుజావలి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన 2023లో రుద్రవరం రేంజ్ అహోబిలం సెక్షన్ డీఆర్వోగా విధుల్లో చేరాడు. ఇటీవలె రేంజి అధికారిగా ఉన్న శ్రీపతినాయుడు బదిలీపై వెళ్లడంతో ఇక్కడ ఖాళీ ఏర్పడింది. దీంతో అటవీ శాఖ ఉన్నతాధికారులు డీఆర్వోగా ఉన్న ముర్తుజా వలికి రేంజర్‌గా పదోన్నతి కల్పించి రుద్రవరానికి నియమించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

మత్స్యకారుల మధ్య కూటమి ప్రభుత్వం చిచ్చు

- వైఎస్సార్‌సీపీ బెస్త సాధికారిత సమితి రాష్ట్ర అధ్యక్షుడు తెలుగు అనిల్ కుమార్



కర్నూలు(టౌన్): కార్పొరేషన్ పదవుల పేరుతో కూటమి ప్రభుత్వం మత్స్యకార కులాల మధ్య చిచ్చు పెడుతుందని వైఎస్సార్‌సీపీ బెస్త సాధికారిత సమితి రాష్ట్ర అధ్యక్షుడు తెలుగు అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇటీవల 31 కార్పొరేషన్ పదవులను ప్రకటించిందన్నారు. అయితే, నిజమైన కులాలకు కాకుండా బెస్తయేతర వారికి ఆ పదవులు కట్టబెట్టి చిచ్చురాజేసిందన్నారు. బెస్త సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పట్టపు సామాజిక వర్గానికి చెందిన బొమ్మన శ్రీధర్‌ను ప్రకటించి నిజమైన బెస్త సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. పట్టపు రాజు లేదా పట్టపు కాపు సామాజిక వర్గానికి చెందిన ఆయనకు బెస్త కార్పొరేషన్ చైర్మన్‌గా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. సీమలో ఫ్యాక్షన్‌కు బలి అవుతున్న బెస్తలకు కనీసం కుల కార్పొరేషన్ పదవుల కేటాయింపులో కూడా న్యాయం జరగలేదన్నారు. అలాగే గత జులై నెల 7 వ తేదీన జీవో 81 ప్రకారం కొల్లు పెద్దిరాజును మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రకటించారన్నారు. పదవుల విషయంలోనే కాకుండా మత్స్య కార సమస్యలు పరిష్కారంలోనూ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బెస్తలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని లేకపోతే భవిష్యత్తులో వారి ఆగ్రహం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు బలవన్మరణం





మృతిచెందిన షేక్ జుబేదాబేగం, భారతి

ఓర్వకల్లు/బనగానపల్లె/నందికొట్కూరు: వివిధ కారణాలతో వేర్వేరు చోట్ల ముగ్గురు వ్యక్తులు బలవన్మరణానికి పాల్పడ్డారు. వీరిలో ఒకరు రైతు కాగా మరో ఇద్దరు మహిళలు ఉన్నారు. పోలీసులు, స్థానికులు తె లిపిన వివరాల మేరకు.. ఓర్వకల్లు గ్రామం పెండేకంటినగర్‌లో నివాసముంటున్న సుబ్బరాయుడు కొడు కు భానుప్రకాష్‌కు, అదే గ్రామానికి చెందిన రెడ్డిపోగు మాదన్న కూతురు భారతి(31)కి మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి పాప,బాబు సంతానం. అయితే ఆటో నడిపే భాను ప్రకాష్ మద్యానికి అలవాటుపడి సంపాదనంతా మందుకే ఖర్చు చేసేవాడు. దీంతో భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు తలెత్తాయి. ఈ క్రమంలోనే ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వెళ్లడంతో భార్య భారతి తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు తండ్రి మాద న్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ పేర్కొన్నారు.

అప్పులబాధతో..

బనగానపల్లె మండలం నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని కైప గ్రామానికి చెందిన రైతు వెంకటరమణరెడ్డి(37) అనే వ్యక్తి అప్పుల బాధతో శుక్రవారం ఉదయం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన గతేడాది రెండు ఎకరాల సొంత పొలంతో పాటు మరో 25 ఎకరాలు కౌలుకు తీసుకొని మిరప సాగు చేశాడు. ఇందుకు దాదాపు రూ. 20 లక్షల వరకు ఖర్చు చేశాడు. అయితే, పంట పండక తీవ్రనష్టం వచ్చింది. దీంతో చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈమేరకు మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె సంతానం.

జీవితంపై విరక్తి చెంది..

మిడుతూరు మండలం అలగనూర్ గ్రామానికి చెందిన షేక్ జుబేదాబేగం (20) అనే యువతి గురువారం రాత్రి బలవన్మరణం చేసుకుంది. అనారోగ్యంతో పాటు, కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకుంది. ఈ మేరకు తండ్రి ఉసేన్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు.

- నిలచిపోయిన కోత పనులు
- ఆందోళనలో రైతన్నలు

ఇంకా నీటిలోనే నల్ల బంగారం



వర్షపునీటిలో మినుము పంట



డబ్ల్యూ గోవిందిన్నెలో కోతకు వచ్చిన మినుము

దొర్నిపాడు: తొలిపంటగా సాగుచేసిన నల్లబంగారం చేతికిరాని పరిస్థితి నెలకొంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు పంట పూర్తిగా దెబ్బ తినింది. కేవలం 90 రోజుల్లో చేతికి వస్తుందని రైతులు విస్తారంగా మినుము పంట వేశారు. ఒక్క దొర్నిపాడు మండలంలోనే దాదాపు 700 హెక్టార్లకు పైగా ఈ పంట సాగైంది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. తీరా కోత సమయంలో రైతుల ఆశలపై వర్షం నీళ్లు చల్లింది. గత పది రోజులుగా కురుస్తున్న వానలకు మినుము పంటంతా నీటిలోనే ఉంది. దీంతో కోత పనులు ఎక్కడికక్కడే నిలచిపోయాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కోతమిషన్లు పనులు లేక గ్రామంలో నిలబడిపోయాయి. రోజు ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తుండటంతో కోతకు నేల అనుకూలించక రైతులు దిగాలు చెందుతున్నారు.



పనులు లేక నిలిచిన మినుముకోత యంత్రాలు

కాసిన అరకొర గింజలు సైత నేల రాలుతున్నాయని వాపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కల్లూరు: 44వ జాతీయ రహదారి చిన్నటేకూరు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన వి. రాజు (31) దుర్మరణం చెందాడు. ఉలిందకొండ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కల్లూరు మండలం తడకపల్లె గ్రామంలో జరుగుతున్న మొహర్రం 40 రోజుల జార్తాలకు భార్య దుర్గ, మరో ఇద్దరితో కలిసి బైక్‌పై రాజు గురువారం వెళ్లాడు. మొక్కులు చెల్లించుకొని శుక్రవారం స్వగ్రామానికి బయలుదేరాడు. తడకనపల్లె క్రాస్ రోడ్డులో మోటర్ సైకిల్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి రైలింగ్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న రాజు అక్కడికక్కడే మృతి చెందగా.. మిగతా ముగ్గురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న నేషనల్ హైవే పెట్రోలింగ్ హెడ్ కానిస్టేబుల్ నూర్ అహమ్మద్, పోలీసులు వారిని 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రానైట్ దుకాణంలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

నందికొట్కూరు: పట్టణ సమీపంలోని మై హోమ్ గ్రానైట్ దుకాణంలోకి శుక్రవారం నందికొట్కూరు డిపోకు చెందిన ఆర్టీసీ బెంగళూరు సర్వీస్ దూసుకెళ్లింది. అయితే, ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బెంగళూరు నుంచి వస్తున్న ఈ బస్సులో డ్రైవర్ కలిముల్లాకు బీపీ డౌన్ అయింది. దీంతో స్టీరింగ్ పట్టు తప్పడంతో బస్సు గ్రానైట్ దుకాణంలోకి వెళ్లి బండలను ఢీకొట్టినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి గాయలు కాలేదని వెల్లడించారు. కాగా బస్సు ఢీకొనంతో సుమారు రూ. 9 లక్షల విలువ చేసే గ్రానైట్ బండలు పగిలిపోయినట్లు గ్రానైట్ యజమాని సద్దాం తెలిపారు.

కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృతి



మృతి చెందిన గొర్రె పిల్లలు

కర్నూలు(రూరల్): కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృతి చెందాయి. మండల పరిధిలోని జి.సింగవరం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన బైరి పెద్ద మద్దిలేటి జీవాలు పెంచుతుంటాడు. శుక్రవారం గ్రామ సమీపాన కేసీ కెనాల్ వంతెన దగ్గర ఉన్న దొడ్డిలో గొర్రె పిల్లలను ఉంచి మందను మేతకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో దాదాపు 6 కుక్కలు దొడ్డిలోకి దూకి గొర్రె పిల్లలపై దాడికి తెగబడ్డాయి. ఈ ఘటనలో 15 పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. తర్వాత దొడ్డికి వచ్చి చూడగా గొర్రె పిల్లలు చనిపోయి చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఈ ఘటనతో రూ.90 వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

బైక్ అదుపు తప్పి..

ఆళ్లగడ్డ: అహోబిలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంతియాజ్ బాషా (24) అనే యువకుడు శుక్రవారం మృతి చెందాడు. నంద్యాల రూరల్ మండలం కానాల గ్రామానికి చెందిన ఇంతియాస్ బాషా ఓ శుభకార్యానికి అహోబిలం వచ్చాడు. మధ్యాహ్న సమయంలో దిగువ అహోబిలం నుంచి ఎగువ అహోబిలం వెళ్తుండగా మార్గమధ్యంలో మోటర్ సైకిల్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టింది. ఈఘటనలో ఇంతియాజ్ బాషా అక్కడికక్కడే మృతి చెందగా బైక్ వెనుక కూర్చున్న వెంకట సునీల్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

ఉత్తమ సేవలకు ప్రశంస



డీఆర్ఓ రామునాయక్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించారు. శుక్రవారం నంద్యాల డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



విశ్వనాథ్, ఆర్‌డీఓ, నంద్యాల | నరసింహులు, ఆర్‌డీఓ, డోన్ | దాసిరెడ్డి నాగజ్యోతి, ఆర్‌డీఓ, ఆత్మకూరు | రాంభూపాల్‌రెడ్డి, స్పెషల్ డీసీ, నంద్యాల | నాగరాజు, పీఆర్ ఇంజినీర్, నంద్యాల | మనోహర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ | వి.మధన్‌మోహన్, నేషనల్ హైవే, నంద్యాల



లీలావతి, ఐసీడీఎస్ పీడీ, నంద్యాల | జనార్ధన్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల | వేణుగోపాల్, జిల్లా స్టాటిస్టికల్, నంద్యాల | నాగరాజు, హార్టికల్చర్ అధికారి, నంద్యాల | సత్యనారాయణ, ఏపీ ఎంఐపీడీ, నంద్యాల | కిశోర్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, ఈఈ | సుధాకర్ కుమార్, ఇంజనీర్, ఏపీఎస్పీడీసీఎల్



శ్రీకాంత్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ | శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల | వెంకటసుబ్బారెడ్డి, సీఈఓ, జిల్లా పరిషత్ | గోవిందనాయక్, పశు సంవర్ధకశాఖ అధికారి | లక్ష్మీదేవి, జిల్లా ట్రెజరీ ఆఫీసర్, నంద్యాల | బషిరున్నీసాబేగం, లేబర్ ఆఫీసర్, నంద్యాల | జయరాజ్, సర్వే డిపార్టుమెంట్, నంద్యాల



రవీంద్రకుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ | శివారెడ్డి, డీఎల్‌డీఓ, నంద్యాల | నరసింహారెడ్డి, డీఎల్‌డీఓ, డోన్ | కిశోర్, ఆళ్లగడ్డ మునిసిపల్ కమిషనర్ | శేషుకుమార్, కానిస్టేబుల్ | నాగమణి, తహసీల్దార్, బేతంచెర్ల | నరసింహారావు, కలెక్టరేట్ ఎస్ఓ



సుబాకర్‌రావు, కలెక్టర్ ఆఫీసు ఏఓ | అనిత, నేషనల్ హైవే సెక్షన్ డీటీ | నారాయణస్వామి, డీటీ, కలెక్టర్ ఆఫీసు | సౌజన్య, డీటీ రీ సర్వే, కలెక్టర్ ఆఫీసు నంద్యాల | ఏ.రాజేష్, ఎలెక్షన్ సెల్, కలెక్టర్ ఆఫీసు | శారదా దేవి, అగ్రికల్చర్ ఆఫీసర్, నంద్యాల | కవిత, అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, నంద్యాల



నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్, డోన్ | అనురాధ, వెటర్నరీ ఆఫీసర్, ఎం.చింతకుంట్ల | రేవతి, ఈఎస్సీ కో ఆర్డినేటర్, నంద్యాల | ప్రభాకర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ, మహానంది | బి.శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఏఈ, నంద్యాల | బి.ఉమాదేవి, జేఎల్ బాటని, ఆళ్లగడ్డ | శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్, పాణ్యం



మాధవి, మెడికల్ ఆఫీసర్, బండిఆత్మకూరు | చైతన్యలక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓ హాస్టల్, కోవెలకుంట్ల | దీపా, ఏఈఓ, నంద్యాల | వి.అనిత, ట్యాక్స్ అసిస్టెంట్, నంద్యాల | ఎస్.సుజాత, ఆఫీసు సబార్డినేట్, నంద్యాల | ఉమాదేవి, సివిల్ సర్జన్, బనగానపల్లె | రత్నజ్యోతి, స్టాఫ్‌నర్స్ సున్నిపెంట



కళావతి, హెడ్‌నర్స్, పాణ్యం | వి.భాస్కరనాయుడు, డ్వామా పీడీ, నంద్యాల | విజేత, పీడీ వాటర్‌షెడ్ | పి.ఆదెమ్మ, బీఎఫ్‌టీ మహానంది | శ్రీనివాసబాబు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ | శ్రీనివాసరెడ్డి, ఈఓ, మహానంది దేవస్థానం | చైతన్యకుమార్‌రెడ్డి, ఫైర్‌మ్యాన్, నంద్యాల



వి.సుబ్బారెడ్డి, ఫైర్ సెక్షన్, ఆళ్లగడ్డ | కృష్ణప్రసాద్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, బైర్లూటీ | గాయత్రి, స్టాఫ్‌నర్స్, నంద్యాల | సురేఖ, ప్రిన్సిపాల్ మెడికల్ కాలేజీ, నంద్యాల | కృష్ణమోహన్, మెడికల్ కాలేజీ, నంద్యాల | ఐశ్వర్య, మహిళా పోలీసు, ఆత్మకూరు | వేదావతి, మహిళా పోలీసు శక్తిటీం



తేజశ్వణి, హార్టికల్చర్ ఆఫీసర్, నందికొట్కూరు | ఆంజనేయులు, సమాచార శాఖ నంద్యాల | అనురాధ, సమాచార శాఖ, నంద్యాల | చంద్రశేఖర్‌రెడ్డి, వెల్ఫేర్ డిపార్టుమెంట్, కలెక్టరేట్ | సిరాజ్ మహమ్మద్, ఎస్‌బీఐ టీం, బెక్స్, నంద్యాల | నాగేంద్రబాబు, యూనియన్ బ్యాంక్ మేనేజర్, బనగానపల్లె | జునైద్ అహమ్మద్, కెనరాబ్యాంక్, నంద్యాల



లక్ష్మీదేవి, ఏపీజీబీ, మేనేజర్, నంద్యాల | కిరణ్‌కుమార్, పీహెచ్‌సీ గడివేముల | చంద్రకాంత్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ | లక్ష్మిసుధ, పీజీఆర్ఎస్, కలెక్టర్ ఆఫీసు, నంద్యాల | శోభారాణి, ఎస్ఐ, పీజీఆర్ఎస్, నంద్యాల | విజయలక్ష్మి, మహిళా కానిస్టేబుల్, పీజీఆర్ఎస్ | కె.జయరాములు, సీఐ మహిళా పీఎస్, నంద్యాల



చంద్రబాబు, సీఐ శ్రీశైలం | కిరణ్‌కుమార్‌రెడ్డి, సీఐ, పాణ్యం | కె.ప్రవీణ్‌కుమార్, సీఐ, బనగానపల్లె | టి.సుబ్రమణ్యం, సీఐ, నందికొట్కూరు | సూర్యమౌళి, సీఐ ఎస్‌బీ-2, నంద్యాల | రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఐ, మహానంది | జయప్ప, ఎస్ఐ, ఆళ్లగడ్డ



శ్రీనివాసరెడ్డి, రీ సర్వే డీటీ, కలెక్టర్ ఆఫీసు | మహబూబ్‌బాషా, డీటీ రీ సర్వే, కలెక్టర్ ఆఫీసు | ఇమ్రాన్‌హుసేన్, డీటీ రీ సర్వే, కలెక్టర్ ఆఫీసు | కాశీరాములు, సీనియర్ అసిస్టెంట్, ఎస్‌హెచ్, కలెక్టర్ ఆఫీసు | స్నేహలత, ల్యాండ్ మార్క్ సెక్షన్, కలెక్టర్ ఆఫీసు | మనోజ్ కార్తీక్, సీనియర్ అసిస్టెంట్, కలెక్టర్ ఆఫీసు | సుకుమార్‌రెడ్డి, సహకార బ్యాంక్ ఉద్యోగి, నంద్యాల